క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు సన్మానం



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానించిన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం పాటు వాటిని శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భవానీ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన ఎమ్మెల్యేను గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భవానీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కాలనీలో కరెంటు సమస్య పరిష్కారానికి రూ.43 లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

ఏజీవర్సిటీ రిజిస్ట్రార్ పదవీ విరమణ

ఏజీవర్సిటీ: ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ.సుధీర్‌కుమార్ పదవీ విరమణ కార్యక్రమాన్ని గురువారం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 37 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ నరేంద్రరెడ్డి అధికారులు డాక్టర్ సీమ, అనిత సత్యనారాయణ, కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.


క్రికెట్, సినిమాలు, చికెన్.. ఆ క్రేజే వేరు

- ప్రముఖ టాలీవుడ్ హీరో సందీప్ కిషన్
- డెల్సైజ్ స్టోర్‌ను ప్రారంభించిన సందీప్ కిషన్



సాక్షి, సిటీబ్యూరో: క్రికెట్, సినిమాలు, చికెన్.. దేశంలో ఈ మూడు ఎప్పుడూ టాప్‌లో ఉంటాయని ప్రముఖ టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ తెలిపారు. గురువారం మణికొండ వేదికగా సుగుణ ఫుడ్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డెల్సైజ్ స్టోర్‌ను హీరో సందీప్ కిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషక విలువలనందించే చికెన్ వెరైటీలు, ముఖ్యంగా చికెన్ పికిల్ అంటే తనకెంతో ఇష్టమని అన్నారు. ప్రస్తుతం తదుపరి సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నానని, త్వరలో 'ఊరుపేరు భైరవ కోన' సినిమాతో పాటు మరో రెండు సినిమాలతో రాబోతున్నానని అన్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎమ్‌వీఆర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఒమేగా3, విటమిన్ డి, కెరోటినాయిడ్స్ వంటి పోషక విలువలనందించే నాణ్యమైన చికెన్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, కొండాపూర్, చందానగర్, మాదవపురి హిల్స్ ప్రాంతాల్లో కొత్త స్టోర్ల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా తనను కలవడానికి వచ్చిన అభిమానులతో హీరో సందీప్ కిషన్ సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

శిల్పారామంలో కూచిపూడి వర్క్‌షాప్



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న కూచిపూడి నృత్య వర్క్‌షాప్ శనివారంతో ముగియనుంది. పద్మభూషణ్ వెంపటి చినసత్యం కుమార్తె చావలి బాలత్రిపురసుందరి నిర్వహిస్తున్న వర్క్‌షాపులో దాదాపు ముప్పైమంది కళాకారులు పాల్గొన్నారు. శిబిరంలో తాళం, లయ, జతులు, అభినయం తదితరాలపై మెళకువలను నేర్పిస్తున్నారు.

పుస్తకావిష్కరణ

రాయదుర్గం: అనువాదానికి భారతదేశం సరైన ప్రదేశమని జామియా మిలియా ఇస్లామియా ప్రొఫెసర్ అనిసుర్‌రహ్మాన్ గురువారం పేర్కొన్నారు. మనూ విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు సాగే అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భాషా, సాంస్కృతిక వైవిధ్యం కారణంగా భారతదేశం అనువాదం, తులనాత్మక అధ్యయనాలకు సరైన ప్రదేశంగా చెప్పవచ్చన్నారు. వీసీ మాట్లాడుతూ మూలాధార సంస్కృతి యొక్క అనుభవాన్ని వివరించారు.అనంతరం హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ దొడ్డా శేషుబాబు 'మై దేఖ్ రహా హూన్' పేరిట అనువదించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.

ఇంద్రధనుష్ సమ్మర్ క్యాంపు

- సీసీఆర్టీలో జూన్ 2వ తేదీ వరకు శిక్షణ తరగతులు
- చిన్నారులకు వివిధ అంశాలలో తర్ఫీదు



శిక్షణ పొందుతున్న చిన్నారులు





మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో చిన్నారులు తమ సత్తా చాటుతున్నారు. దాదాపు 4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్)లో విద్యార్థుల కోసం ఇంద్రధనుష్ పేరిట సమ్మర్‌క్యాంపును నిర్వహిస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 6 నుండి 9వ తరగతి చదువుతున్న చిన్నారులు ఈ క్యాంపులో వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్నారు. కళలు, సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనంపై అధ్యాపకులు విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

- ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిక్షణ ఉంటుంది.
- పోటరీ, క్లే మోడలింగ్, టై అండ్ డై , అప్లిక్యూ ఆర్ట్, పేపర్ క్రాఫ్టులతోపాటు కూచిపూడి డ్యాన్స్, ఫోక్‌డ్యాన్స్, మూమెంట్, మైమ్, ఫొటోగ్రఫీ, క్లాసికల్ పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు.
- ఈ నెల 23వ తేదీన ప్రారంభమైన తరగతులు జూన్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు.
- శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేయనున్నారు.
- మట్టికుండల తయారీ ద్వారా మట్టి కుండలను ఏవిధంగా వాడేవారు. వాటి వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయనే అంశాలను అధ్యాపకుడు ముత్యాలు చిన్నారులకు వివరిస్తూ శిక్షణ ఇస్తున్నారు.
- క్రాఫ్ట్‌ను అధ్యాపకురాలు అరుణజ్యోతి సులభ పద్ధతిలో పిల్లలకు నేర్పిస్తున్నారు.
- టై అండ్ డై అధ్యాపకులు సత్యనారాయణ , సాంగ్స్ అంకిత తివారీ, స్టోరీ టెల్లింగ్ సుబ్బలక్ష్మి, డ్రామా డాక్టర్ రాజీవ్ రాజన్‌లు బోధిస్తున్నారు.


డ్రామా గురించి నేర్చుకుంటున్నాను



నేను మొదటిసారి గచ్చిబౌలి నుంచి వచ్చాను. డ్రామా నేర్చుకుంటున్నాను. 6వ తరగతి చదువుతున్నాను. డ్రామాకు ఉన్న ప్రాముఖ్యత, విషయాన్ని ఎలా తెలియపరచాలో మాస్టారు వివరించారు. చాలా అద్భుతంగా ఉంది. డ్రామాతో పాటు మిగతా అంశాలలో శిక్షణ తీసుకుంటున్నాను. మా ఇంట్లో డ్రామా అంటే చాలా ఇష్టం. నాటకాలు వేయడం ద్వారానే సినిమా రంగంలోని పలువురు ప్రముఖులకు స్థానం కలిగిందని వివరించారు.

–వేదాంత్, 6వ తరగతి

కుండలు తయారు చేయడం ఇష్టం



విద్యతో పాటు ఏదో ఒక అంశంపై పట్టు సాధించాలన్నదే నా కోరిక. ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మర్ క్యాంపులో పాల్గొనడం అంటే చాలా ఇష్టం. పాటలు పాడడం, కుండలు తయారు చేయడం అంటే చాలా ఇష్టం. నేను తయారు చేసిన కుండలను ఇంట్లో గుర్తుగా పెట్టుకుంటాను. అధ్యాపకులు సులభంగా తయారీ విధానాన్ని తెలుపుతున్నారు. ఫ్రెండ్స్‌తో కలసి నేర్చుకోవడం సరదాగా ఉంది.

–వైష్ణవి, 9వ తరగతి

పుస్తకాలకే పరిమితం కాకుండా..



విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సహించినప్పుడే వారి నైపుణ్యత బయటపడుతుంది. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సంస్కృతి తెలుసుకోవడంతో బాటు సమాజానికి సేవ చేసే దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. సమాజంపై అవగాహన కల్పించాలి. సీసీఆర్టీలో ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మర్ క్యాంపులో పాల్గొంటే పలు అంశాలను నేర్చుకోవచ్చు. సమ్మర్ క్యాంపులో రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 9063357895, 8886333799.

–సౌందర్య, ఫీల్డ్ ఆఫీసర్

మణికొండలో విద్యుత్ సమస్య



ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్

మణికొండ: ప్రతి రోజు గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిచిపోవటం, ఆ విషయాన్ని సిబ్బందికి చెప్పేందుకు ప్రయత్నిస్తే ఫోన్ ఎత్తక పోవటంతో నరకం చూస్తున్నామని మణికొండ గ్రామ ప్రజలు వాపోతున్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా సాగుతుంది. అసలే వేసవి కాలం కావటం, ఓ వైపు ఉక్కబోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సమయంలో అనేక సార్లు విద్యుత్ నిలిచిపోతుండటంతో నిద్ర లేకుండా పోతోందని పలువురు పేర్కొన్నారు. కొన్నిసార్లు మొత్తం సరఫరా నిలిచిపోవటం, మరికొన్ని సార్లు ఒక ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. ఆ విషయాన్ని ఫ్యూజ్ ఆఫ్ కాల్, విద్యుత్ లైన్‌మెన్లు, అధికారులకు వివరించేందుకు ప్రయత్నిస్తే ఫోన్‌లు తీయటం లేదని వారు వాపోతున్నారు.

సామర్థ్యం పెంపునకు అనుమతులు వచ్చినా...

మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు వైపు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రస్తుత సామర్థ్యానికి ఏమాత్రం సరిపోకపోవటంతో మరింత సామర్థ్యంతో కొత్తది ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చినా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానిక కౌన్సిలర్ బి.శ్వేత రవికాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రోజు ఉదయం, రాత్రి సమయాల్లో కలిపి 20 సార్లకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా త్వరలోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని చెప్పి పట్టించుకోవటం లేదన్నారు. ఇకనైనా విద్యుత్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయటంతో పాటు విద్యుత్ సమస్యల నివారణకు పనిచేస్తున్న ఫ్యూజ్ కాల్ సరిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మణికొండ గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ నాగుల స్రవంతి, 20వ డివిజన్ కార్పొరేటర్ బొర్రా సాయిసాగర్‌గౌడ్‌లు అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను చేపట్టారు. 19,20వ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో చెత్తచెదారం, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని, చెత్త సేకరణకు వచ్చే కార్మికులకు అందించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. శుభ్రతలో ప్రజలు భాగస్వాములవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది, కాలనీవాసులు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

కాళీమందిర్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం

రెండు కార్లు, ద్విచక్ర వాహనం ధ్వంసం , తప్పిన ప్రాణాపాయం



ద్విచక్ర వాహనం పైకెక్కి ఆగిన బస్సు



బస్సు ఢీకొన్న ఘటనలో దెబ్బతిన్న కారు

మణికొండ: ఒక్కసారిగా దూసుకు వచ్చిన ఆర్టీసీ బస్సు రోడ్డుపై బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన ఆపిన రెండు కార్లు, ఓ ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కాగా కార్ల ముందు లారీ నిలిపి ఉండటంతో బస్సు ముందుకు పోలేక ఆగిపోవటంతో ప్రాణాపాయం తప్పింది. ఆ సమయంలో అక్కడ లారీ లేకపోతే బస్టాండ్‌లో నిలుచుని ఉన్న ప్రయాణికుల మీదకు వెళితే పెద్ద ఎత్తున ప్రాణాపాయం కలిగేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మొయినాబాద్ నుంచి కోఠికి వెలుతున్న ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కాళీ మందిర్ వద్ద గురువారం మధ్యాహ్నం బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడపటంతో రోడ్డు పక్కన నిలిపి ఉన్న రెండు కార్లు ధ్వంసం కాగా ఓ ద్విచక్ర వాహనంపై నుంచి బస్సు వెళ్లటంతో నుజ్జు, నుజ్జు అయ్యింది. భారీగా ట్రాఫిక్ జాం కావటంతో పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ధ్వంసం అయిన వాహనాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగి పోలీసులు తెలిపారు.

కుట్టుమిషన్ అందజేత



శంషాబాద్: ఓ నిరుపేద మహిళకు త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరి తన జన్మదినం సందర్భంగా కుట్టుమిషన్‌ను గురువారం అందజేశారు. ఇటీవల కుట్టుమిషన్ పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్న మహిళకు కొత్త మిషన్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, నందకిశోర్, బైతి శ్రీధర్, దేవేందర్ తదితరులున్నారు.

నేడు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

రాజేంద్రనగర్: సిక్‌చావ్నీ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో నివసిస్తున్న యజమానులకు శుక్రవారం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్నట్లు రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్ వెల్లడించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న దస్తావేజుల పంపిణీ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఆర్టీఓ చంద్రకళ హాజరుకానున్నట్లు తెలిపారు. సిక్‌చావ్నీ ప్రాంతంలో దాదాపు వెయ్యి మంది దశాబ్దాలుగా ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక జీఓతో వీరికి ఇంటి స్థలాలను నామమాత్రపు రుసుముతో రిజిస్ట్రేషన్ చేస్తుంది. ప్రస్తుతం 386 మంది తమ ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాజేంద్రనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ ప్రక్రియ పూర్తైంది. వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయనున్నారు. మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ పూర్తైన అనంతరం అందిస్తామన్నారు.

నా భర్త పోయాక గెంటేశారు

- పోలీసులకు మహిళ ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: తన భర్త చనిపోయిన కొన్ని నెలలకే అత్తింటివారు వేధిస్తున్నారంటూ బాధితురాలు మమత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హమీదుల్లానగర్‌కు చెందిన నరిగే శ్యాంబాబు(39) మూడునెలల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. అతని భార్య మమతకు ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని అత్తింటివారు ఇంట్లోకి రానివ్వకుండా గెంటేశారు.

బ్యాంకు పత్రాలు, ఏటీఎం కార్డులు, ఇతర ధృవీకరణ పత్రాలు లాక్కున్నారని, మరణ ధృవీకరణ పత్రంలో తన పేరు చేర్చలేదని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది

సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు

రాజేంద్రనగర్: దేశంలో కార్మిక వర్గంపై జరుగుతున్న దాడులపై ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజు అన్నారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం రాజేంద్రనగర్‌లో జి.కురుమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు రుద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రాంమోహన్‌లు హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ కార్మిక వర్గం ఐక్యతను సాధించాలన్నారు. బడా కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చి వాటిని తిరిగి చెల్లించకుండా ఆ అప్పులను రద్దు చేసిన బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలపై వేస్తుందన్నారు. అప్పు మొత్తాన్ని రైల్వేలు పోర్టులు, బొగ్గు బావులు, టెలికాం, విద్యుత్ సంస్థలు, నేషనల్ హైవేలు, పెట్రోలియం కంపెనీల ఆస్తులను తాకట్టు పెడుతుందన్నారు. ఈ నెల 30వ తేదీన సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులు జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెంటయ్య, పార్వతి, బి.స్వామి, ఎస్.జంగయ్య, రాములు, మైలారం జంగయ్య, కృష్ణయ్య, పాండు, నరసింహ, ముస్తాఫా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు

బండ్లగూడ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణెమ్మ, హెచ్ఈఓ శ్రీనివాస్‌లు తెలిపారు. మేరీ లైఫ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు పౌష్టికాహారంతో తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రతి ఇంటి వద్ద, కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షం నీరు వృథా కాకుండా భూమిలో ఇంకేలా ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వి.నాగలక్ష్మి, షాలిని, ఏఎన్ఎం కళమ్మ, ఆశావర్కర్ విజయ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నచ్చిన రంగాన్ని ఎంచుకుని రాణించాలి



వాలీబాల్ టీమ్‌ను అభినందిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: యువత అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం పట్టుదలతో ముందుకు సాగాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ముఖ్యమంత్రి కప్–2023లో రంగారెడ్డి జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడలో గండిపేట్ మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ యువకులు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. వాలీబాల్ టీమ్‌ను గురువారం కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిలు అభినందించి ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని అందులో రాణించాలన్నారు. రాష్ట్రస్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజేంద్రనగర్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికుల సమస్యలు ఏమైనా ఉంటే ఫోన్ నెంబర్ 9959226135కు ఫోన్ చేసి తమ సందేశాలను, సలహాలను అందించాలన్నారు.

నైతిక విలువల పెంపుతోనే ఉత్తమ సమాజ నిర్మాణం

చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుతోనే ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుందని శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. మండలంలోని ముచ్చింతల్ శివారులోని శ్రీరామనగరంలో గురువారం రాష్ట్ర ప్రైవేటు స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో జీయర్‌స్వామి పర్యవేక్షణలో విద్యావేత్తల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి ప్రవచించారు. నేటి సమాజంలో నైతిక విలువల పెంపు అత్యంత అవసరం అన్నారు. ఈ మహా యజ్ఞంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెల్ల కాగితం లాంటి హృదయాలు కలిగిన విద్యార్థుల ద్వారా ఆదర్శమైన సమాజాన్ని సాధించవచ్చన్నారు. పూర్వం విజ్ఞానంతో పాటు విలువలు కూడా బోధించబడేవని తెలిపారు. ఈ మానవతా విలువలను పునరుద్ధరించుటకు నేటి ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని విద్యావ్యవస్థకు పూర్వ వైభవం తేవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు యాదగిరిశేఖర్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, వికాస తరంగిణి అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రజ్ఞ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీరాములు, చల్లా రాఘవరెడ్డి, ఏవీ దినేష్, భానుప్రకాష్, సీనానంద, సీల తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీ ఉపయోగాలపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ చీనానాయక్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'ఉద్యాన, వ్యవసాయ పంటల్లో డ్రోన్ సాంకేతిక ఉపయోగాలు' అనే అంశంపై ఉద్యాన వన విద్యార్థులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చీనానాయక్, ప్రోగ్రాం కో ఇన్వెస్టిగేటర్ డాక్టర్ నటరాజన్‌లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాబోయే రోజుల్లో డ్రోన్ పద్ధతిలోనే ఎక్కువగా వ్యవసాయం చేయాల్సి ఉంటుందని, వ్యవసాయ కూలీల కొరత రైతులకు తప్పదని, దానికి తగిన విధంగా టెక్నాలజీని వాడుకోవాలన్నారు. విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీ పైన అవగాహన కలిగి ఉండాలని, డ్రోన్ సాంకేతికతను నేర్చుకోవడం ద్వారా స్వయం సంవృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, చీఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గిర్వాణి ,డాక్టర్ సైదయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీపై గెస్ట్ లెక్చర్



మాట్లాడుతున్న అచలేందర్‌రెడ్డి

ఏజీవర్సిటీ: ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ అంశంపై 41 దేశాలతో కలిసి బయో డైవర్సిటీ పనిచేస్తుందని నేషనల్ బయోడైవర్సిటీ చైర్మన్ అచలేందర్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బయోడైవర్సిటీ ఫైనాన్స్, గ్లోబల్ బయోవర్సిటీపై గెస్ట్ లెక్చర్ జరిగింది. ఈ సందర్భంగా అచలేందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణానికి జీవనశైలి ,జీవవైవిధ్య పరిరక్షణ, పంచాయతీస్థాయిలో బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు స్కాలర్లు పాల్గొన్నారు.